క్లుప్తంగా

ముక్కంటి సేవలో సుభాష్ పాలేకర్



ఆలయం వద్ద సుభాష్ పాలేకర్

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన



తండ్లంలోని సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం విప్పమానిపట్టెడ, తండ్లం గ్రామాలలో ఉపాధి పనులను బుధవారం జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ పరిశీలించారు. విప్పమానిపట్టెడలో ఉపాధి హామీ పథకంలో రైతు గురవయ్య నిర్మించుకున్న పశువుల షెడ్డు, తండ్లంలో వేసిన సిమెంటు రోడ్డును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, ఏపీఓ జ్యోతి శ్రీ, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీతో ప్రయాణికులకు ఇబ్బందులు



బస్టాండుకు అడ్డంగా టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బుచ్చినాయుడుకండ్రిగ: మంత్రి లోకేష్‌బాబు పుట్టిన రోజు పురస్కరించుకుని ఈ నెల 23న టీడీపీ నేతలు బస్టాండు అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఆ రోజున సంబరాలు నిర్వహించారు. ఆ తర్వాత దీనిని తొలగించలేదు. అప్పటి నుంచి ప్రయాణికులు బస్టాండులోకి వెళ్లలేక ఎండలో ఆరుబయట నిలబడి బస్సులు, ఆటోలు ఎక్కుతున్నారు. సంబంధిత అధికారులైనా స్పందించి దీనిని తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



సత్యవేడులో తాగునీటి పైపులకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సత్యవేడు: పంచాయతీలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి సత్యవేడుకు నీటి సరఫరా అయ్యే పైపు పగిలి పోవడంతో పంచాయతీ సర్పంచ్ పి.మంజుల, కార్యదర్శి మునిరవికుమార్ పర్యవేక్షణలో మరమ్మతులు చేశారు. లీకేజీలు అరికట్టారు. సంత సమీపంలో ఈ పనులు చేశారు.

రాస్ వృద్ధుల సంక్షేమ కేంద్ర సందర్శన



వయో వృద్ధుల సంక్షేమ కేంద్రాన్ని సందర్శిస్తున్న ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి

తిరుపతి కల్చరల్: రేణిగుంట మండలం కరకంబాడిలోని రాస్ వయోవృద్ధుల సంక్షేమ కేంద్రాన్ని, అలాగే విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాల ఆశ్రమాన్ని బుధవారం దివ్యాంగులు, వయోవృద్ధుల, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి సందర్శించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల చట్టాలు, ప్రభుత్వ పథకాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏవై.శ్రీనివాస్, రాస్ ప్రాజెక్టు డైరెక్టర్ యువరాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలోని బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీలోని ఓ ఇంట పేకాట ఆడుతుండగా బుధవారం దాడులు చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపారు. కాలనీలోని గోవర్ధన్ రెడ్డి ఇంటిపై దాడి చేసి తమ సిబ్బందితో దాడి చేసినట్లు ఆయన చెప్పారు. గోవర్ధన్‌రెడ్డితో పాటు మరో ఆరుగురుని అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

శిథిలం..అసాంఘిక కార్యకలాపాలకు నిలయం



నిరుపయోగంగా ఉన్న రేణిగుంట రైల్వే కళ్యాణ మండపం



కళ్యాణ మండపం హాల్లో గ్లాసులు, వాటర్ ప్యాకెట్ల వ్యర్థాలు

- గస్తీ లేకపోవడంతో ఇదీ పరిస్థితి
- పట్టించుకోని రైల్వే అధికారులు

ఒకప్పుడు కల్యాణాలు, ఇతర శుభకార్యాలతో కళకళ లాడిన రైల్వే కళ్యాణ మండపం శిథిలావస్థకు చేరడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రేణిగుంట–తిరుపతి రహదారి పై ఓవర్ పక్కన సీఆర్ఎస్ కాంపౌండ్‌లో ఉన్న రైల్వే కళ్యాణ మండపం మరమ్మత్తులకు గురవడంతో దానిని వాడుకలోకి తేలేదు. దీంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. తర్వాత కాలంలో తలుపులు, గేట్లు అదృశ్యమయ్యాయి. దీంతో రాత్రి పూట మందుబాబులకు అడ్డాగా మారింది. భవనంలో కింద, మిద్దె పైన ఎటుచూసినా ఖాళీ మందు సీసాలు, నిరోధ్ ప్యాకెట్లు ఉండటం చూస్తే ఎలాంటి కార్యకలాపాలకు ఇది నెలవుగా మారిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. భవనంలోకి ఎవరూ ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటే తప్ప వీటికి అడ్డుకట్ట పడేలా లేదని ఇక్కడి పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. ఈ ప్రాంతాల్లో గస్తీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

– శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

గుంతలకిడి గుమ్మా!



ఆంధ్ర–తమిళనాడు రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యవేడు నుంచి చెన్నైకు వెళ్లే మార్గంలో దళవాయి అగ్రహారం వద్ద స్వయాన సత్యవేడు ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ ఎదుట రోడ్డుపై పడిన గుంతల మూలాన తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంక్రాంతి కల్లా గుంతల రహిత రోడ్లుగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటించినా ఈ వైపు గుంతలకు ప్యాచ్ వర్క్ కూడా చేసిన పాపానపోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

– వరదయ్యపాళెం

మృతుని కుటుంబానికి పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 1వ వార్డు వీఎం పల్లెలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పసల సురేష్ సోదరి భర్త పిల్లి మునెయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి వెళ్లి మునెయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

సత్యవేడు: వైస్ ఎంపీపీ డి.సరోజిని భర్త ధనరాజ్(80) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇది తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మదనంబేడుకు వెళ్లి, ధనరాజ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుమారులు రాబర్ట్, పుష్పరాజ్, పురుషోత్తంలను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కేవీ.నిరంజన్ రెడ్డి, సర్పంచులు జయ, శివరంజని, వెంకటేశ్, నాయకులు పళణి, జోసెఫ్, సోము, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ పెన్షన్లను పరిశీలించిన వైద్య బృందం



హెల్త్ పింఛన్లుదార్లను గుర్తిస్తున్న ప్రత్యేక బృందం

సత్యవేడు: మండలంలో హెల్త్ పెన్షన్ రూ.15,000 పొందుతున్న 14 మంది వివరాలను అధికారుల ప్రత్యేక బృందం పరిశీలించింది. బుధవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.వెంకట హరిప్రసాద్(నెల్లూరు), డాక్టర్లు గుణశేఖర్, లావణ్య, ఏపీఓ డాంగేయాదవ్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఈఓపీఆర్డీ తరుణాక్ష రెడ్డి కలసి మండలంలో హెల్త్ పెన్షన్లు పొందుతున్న రోగులను పరిశీలించారు. వీరిలో కన్నావరం1, మదనంబేడు1, చెవరి1, దాసుకుప్పం 1, ఇరుగుళం1, పీవీపురం4, పెద్ద ఈటిపాకం1, రాజగోపాలపురం 3, సత్యవేడులో ఒకరు చొప్పున పింఛనుదారులు ఉన్నారు. వీరిలో 13 మందిని పరిశీలించారు. సత్యవేడుకు చెందిన కే. సరోజమ్మ(పక్షవాతరోగి) గత వారం మృతి చెందినట్లు తెలుసుకున్నారు. తక్కిన పెన్షన్లన్నీ సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు.

శ్మశాన వాటిక దారి సమస్య పరిష్కరించరూ!

–తహసీల్దార్‌కు గోవర్ధనగిరి దళితుల వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గోవర్థనగిరి వాసులు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని గోవర్ధనగిరి దళితవాడ శ్మశాన వాటిక దారి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు తహసీల్దార్ రమేష్ బాబుకు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ. దళ/తవాడకు కొన్నేళ్లు శ్మశాన బాటగా ఉపయోగిస్తున్న దారిని గుడి మాన్యంగా పేర్కొంటూ తమను వేరే దారిలో వెళ్లాలని అడ్డుకుంటున్నారని, సమాధులను సైతం ధ్వంసం చేసి, సర్వే హద్దుల రాళ్లు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఈ గుడి మాన్యం రోడ్డు పనులు మొదలుపెట్టారని సమస్యను నివేదించారు. రికార్డులతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

పురంధర దాసుకు పుష్పాంజలి



పురంధర దాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రతినిధులు, భజన మండళ్ల సభ్యులు

తిరుపతి కల్చరల్: దాస సాహిత్య పితామహుడు పురంధరదాస ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బుధవారం అలిపిరి వద్దనున్న ఆయన విగ్రహానికి టీటీడీ దాస సాహిత్య ప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అలాగే భజన మండళ్ల సభ్యులు పురంధర దాసు విగ్రహం వద్ద భజన కార్యక్రమాలతో అంజలి ఘటించారు. కార్యక్రమంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్.ఆనందతీర్థాచార్యుడు, ఇతర అధికారులు, భక్తులు, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

కర్ణపేయం.. దాసపదాల సంకీర్తనం

తిరుమల: తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాలు బుధవారం సాయంత్రం శ్రీ పురంధరదాసుల కీర్తనల భక్తి పారశ్యంతో పులకించాయి. బుధవారం శ్రీ పురంధరదాసు ఆరాధన మహోత్సవాల్లో రెండో రోజు శ్రీవారు ఉభయదేవేరులతో కలిసి నారాయణగిరి ఉద్యానవనాలకు వేంచేపు చేశారు. చల్లటి సాయంత్రం వేళ ఊంజల్‌సేవలో దాస సంకీర్తనల గానం భక్తులను మైమరపింపచేసింది. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది. టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు, ఇతర అధికారులు, 3,500 మందికి పైగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకకు చెందిన భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి డీఎంగా మునిచంద్ర

- పీలేరు డీఎంగా నిర్మల



తిరుపతి అర్బన్: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా టి. మునిచంద్రను నియమిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఆదేశాలు ఇచ్చారు. ఆయన తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో (డీపీటీఓ) ఏఎంగా పనిచేస్తున్నారు. 4 నెలల క్రితం శ్రీకాళహస్తి డీఎం రాజవర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత తిరుపతి డీఎం బాలాజీకి అదనపు బాధ్యతగా శ్రీకాళహస్తి డీఎం పగ్గాలు కట్టబెట్టారు. తాజా ఉత్తర్వులతో టి. మునిచంద్ర నియమించారు. మరోవైపు మంగళం డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న బి.నిర్మలను పీలేరు డీఎంగా బదిలీ చేశారు.

గీత కార్మికులకు 4 మద్యం దుకాణాలు

–దరఖాస్తు చేసుకోవాలన్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎక్సైజ్ డివిజన్ పరిధిలో గీత కార్మికులకు నాలుగు మద్యం దుకాణాలను కేటాయించినట్లు డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 5వ తేదీ లోపు ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, తొట్టంబేడు, కేవీబీపురం, శ్రీకాళహస్తి రూరల్‌లో ఒక్కో దుకాణం కేటాయించామని, సంబంధిత తహసీల్దారు కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రం తీసుకుని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని లేదా తమ కార్యాలయంలో నేరుగా ఇవ్వవచ్చన్నారు. రూ.2లక్షలు దరావత్తు చెల్లిస్తే అప్లికేషన్ డౌన్‌లోడ్ అవుతుందని, ఈ మద్యం షాపులకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. 7వ తేదీ కలెక్టరేట్‌లో లాటరీ తీసి ఎంపిక చేస్తారన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, గోకులం షెడ్డు ప్రారంభం

సత్యవేడు: మండలంలోని వీఆర్ కండ్రిగ పంచాయతీలో రెండు వీధుల్లో సిమెంటు రోడ్లు, ఒక గోకులం షెడ్డును బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పనకు అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ టి. సుబ్రమణ్యం, ఎంఈఓ కే.రవి, ఇన్‌చార్జి ఏపీఓ లోకమ్మ, సుధాకర్ రాజు, మాజీ జెడ్పీటీసీ కే.సుందరరామి రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి వీకేఎన్ పరమశివం(బాషా), లోకయ్య రెడ్డి, రూపేష్, మురళి, మోహన్, హేమభూషణం, బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వీరరాఘవస్వామి కటాక్షం

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి గరుడ వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం దీపారాధన ఉత్సవంలో మహిళలు మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఊంజల్‌సేవను అన్నమయ్య సంకీర్తన కచేరి మధ్య నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ట్రాక్టర్‌పై వివిధ పుష్పాలతో అలంకరించిన గరుడ వాహనంపై వీరరాఘవస్వామి అధిష్టించి విహరించారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: అమావాస్యను పురస్కరించుకుని బుధవారం స్థానిక పీవీరోడ్డులోని అంకమ్మ ఆలయం వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మూడేళ్లుగా ప్రతి అమావాస్యకు ఈ వితరణ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'సిపాయి' అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



శ్రీకాళహస్తి: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ, రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలను బుధవారం రేణిగుంట బస్టాండ్ కూడలిలో వైఎస్సార్ సీపీ నాయకులు, వన్నె రెడ్డి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడారు. ఎంతో మంది పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందివ్వంతోపాటు ఎక్కడైనా పేదలు మరణిస్తే ఆ కుటుంబానికి 'సిపాయి భరోసా'తో ఆదుకుంటున్నారన్నారు. ఆయనకు ప్రజల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఆయన ముక్కంటిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అన్నదాన కార్యక్రమంలో వన్నె కుల క్షత్రియ సంఘం రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ భరత్ కుమార్, డాక్టర్ జనార్దన్, గణేష్ రెడ్డి, కేఆర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, వీఆర్.రావణ, మండల కో–ఆప్షన్ సభ్యుడు హసన్ సాహెబ్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, జాన్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో చీరల పంపిణీ

రేణిగుంట(ఏర్పేడు): ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తన జన్మదినం పురస్కరించుకుని బుధవారం ఏర్పేడు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు, అలాగే మండలంలోని పాతవీరాపురం ఎస్టీ కాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఏర్పేడు సర్పంచ్ నల్లపాలెం శివయ్య, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, ముని కృష్ణారెడ్డి, హరిదాస్, మోహన్ రెడ్డి, చుక్కమ్మ, రాణెమ్మ పి.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులతో కలిసి అన్నదానం చేశారు. అలాగే ఏపీ సీడ్స్ వద్ద మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధురెడ్డి, అలాగే వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ భరత్ కుమార్, నాయకుడు పెరుమాల్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ సిపాయి జన్మదిన వేడుకలను నిర్వహించారు. తొట్టంబేడు మండలంలోని వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఉన్నం వాసునాయుడు, బుజ్జిరెడ్డి, రత్నంరెడ్డి, వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మురళీకృష్ణారెడ్డి, లక్ష్మీపతి రెడ్డి, కంఠా ఉదయ్, హరినాయుడు, జీవీకే రెడ్డి, పఠాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

- హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు కుంటి సాకులు
- సీపీఐ జిల్లా కార్యదర్శి విమర్శ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

శ్రీకాళహస్తి: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇల్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్మాణ బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు ఎన్నికల్లో ఇచ్చిన తల్లికి వందనం, అర్హులైన మహిళలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడు అధికారంలో లేనప్పుడో మాట, ఉన్నప్పుడు మరోమాట మాట్లాడుతూ నాలుక మడతేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చవరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, తులసీరాజన్, గోపి, ధర్మయ్య, మించల శివకుమార్, చారులత, శీను, చందు, మణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యంగా పోలీస్ సేవలు



మత్తేరిమిట్ట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మద్యం బాటిళ్లను తొలగిస్తున్న శ్రీసిటీ డీఎస్పీ, సీఐలు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): పరిసర ప్రాంతాల శుభ్రతే లక్ష్యంగా సామాజిక దృక్పథంతో పోలీసులు వ్యవహరిస్తున్నారని శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు అన్నారు. బుధవారం మత్తేరిమిట్ట ప్రాంతంలో శ్రీసిటీ డీఎస్పీ, సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బంది కలసి పరిసరాలను శుభ్రం చేశారు. మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రధానంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలను గుర్తించి అక్కడ ఇకపై మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. అంతేకాక రాత్రిళ్లలో సైతం ఆ ప్రాంతాల్లో లైట్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు.